క్లుప్తంగా

మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలి



ప్యాకింగ్ మెషిన్‌ను అందజేస్తున్న జ్యోతి

భాకరాపేట : మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించినప్పుడే ఆర్థికాభివృద్ధి సాధ్యమని డీఆర్‌డీఏ పీడీ జ్యోతి తెలిపారు. ఆయన బుధవారం చిన్నగొట్టిగల్లు మండలం రంగన్నగారి గడ్డలోని ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్‌కు ప్యాకింగ్ మెషిన్ అందజేశారు. అలాగే నెల్లట్లవారిపల్లెలో నిర్మించిన కలెక్షన్ సెంటర్‌ను సందర్శించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి మహిళా పొదుపు చేయడంతోపాటు పొదుపు సంఘాల్లో ఉంటూ ఆర్థిక పరిపుష్టిని సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏపీఎం కుమార్, సీసీలు జగదీష్, సురేష్ పాల్గొన్నారు.

బ్యాంకు గార్డుకు ఘన వీడ్కోలు

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి స్టేట్ బ్యాంకు ఆర్మడు గార్డుగా పనిచేస్తున్న శరత్ చంద్రారెడ్డి బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయనకు బ్యాంకు సిబ్బంది ఘన వీడ్కోలు పలికారు. బీజేపీ జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ గుండాల గోపీనాథ్ రెడ్డి శ్రీవారి చిత్రపటంతో సత్కరించారు.

బైక్ ఢీకొని ముగ్గురికి గాయాలు

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి - తిరుపతి జాతీయ రహదారిలోని తొండవాడ సమీపంలో బుధవారం బైక్ ఢీకొనడంతో ముగ్గురు గాయపడ్డారు. చంద్రగిరి మండలం గంగుడుపల్లికి చెందిన మునికృష్ణారెడ్డి పని నిమిత్తం తిరుపతి బయలుదేరాడు. చంద్రగిరి అరుణ కాలనీ వద్ద యువకుడు బైక్‌లో వేగంగా వస్తూ ఢీకొన్నాడు. అనంతరం భయంతో ఆపకుండా వేగంగా వెళుతూ నడిచి వెళుతున్న చైతన్య టెక్నో స్కూల్‌లో పనిచేస్తున్న బిందు, హేమమాలిని ఢీకొన్నాడు. గాయపడిన ముగ్గురిని 108 సిబ్బంది రుయా ఆసుపత్రికి తరలించారు. చంద్రగిరి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్యాన్సీ షాప్ సీజ్

తిరుపతి తుడా: శ్రీనివాస సేతు ఫ్లై ఓవర్ పిల్లర్లపై నిబంధనలు అతిక్రమించి పోస్టర్లు అతికించిన మరో షాపుపై మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు కొరడా ఝుళిపించారు. తనిఖీల్లో భాగంగా పిల్లర్లపై జేఆర్ ఫ్యాన్సీ షాపు పోస్టర్లుగా గుర్తించారు. సంబంధిత షాపు వద్దకు వెళ్లిన ఏసీపీ షణ్ముగం యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అతను సరైన సమాధానం ఇవ్వకపోవడంతో షాప్‌ను సీజ్ చేశారు. ఏసీపీ షణ్ముగం మాట్లాడుతూ తిరుపతి నగరంలో ఎవరైనా మున్సిపల్ కార్పొరేషన్ అనుమతులు లేకుండా హోర్డింగులు, ఫ్లెక్సీలు, పోస్టర్లను ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



మహబూబ్‌బాషా (ఫైల్)

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం అగరాల సమీపంలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి బుధవారం మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. అగరాలకు చెందిన మహబూబ్ బాషా (37) మంగళవారం సాయంత్రం దుకాణానికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికులు 108లో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. చంద్రగిరి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఘాట్ రోడ్డులో రక్షణ గోడను ఢీకొన్న టెంపో ట్రావెలర్

తిరుమల : తిరుమల నుంచి తిరుపతికి వచ్చే మొదటి ఘాట్ రోడ్డులో బుధవారం టెంపో ట్రావెలర్ వాహనం అదుపుతప్పి రక్షణ గోడను ఢీకొంది. కొందరు భక్తులు తిరుపతికి చెందిన ఓ అద్దె టెంపోట్రావెలర్ వాహనంలో శ్రీవారి దర్శనం కోసం తిరుమల చేరుకున్నారు. తిరిగి తిరుపతికి మొదటి ఘాట్ రోడ్డు ద్వారా కిందకు దిగుతుండగా మాల్వాడిగుండం సమీపంలోని మలుపు వద్ద వాహనం అదుపుతప్పి రక్షణగోడను ఢీకొని బోల్తాపడింది. ఈ ప్రమాదంలో భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న ఘాట్ రోడ్డు భద్రతా సిబ్బంది వాహనాన్ని పక్కకు తొలగించారు. ఈ ప్రమాదంపై తిరుమల ట్రాఫిక్ పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు.

మామిడి తోటల పరిశీలన

పాకాల : మండలంలోని దామలచెరువు పంచాయతీ కాకర్లవారిపల్లి, మొరవపల్లి గ్రామాల్లో ఏనుగుల దాడిలో దెబ్బతిన్న పంటలను బుధవారం ఉద్యానవ శాఖ జిల్లా అధికారి బి.దశరథరామిరెడ్డి పరిశీలించారు. రైతులతో మాట్లాడి నష్టం వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన దామలచెరువు మామిడి కాయల మండీలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ మామిడి కాయలు పక్వానికి వచ్చే 20 రోజుల ముందుగా నీటిని కట్టడం ఆపేయాలని సూచించారు. అలాగే పక్వానికి వచ్చిన కాయలను మాత్రమే పలు దఫాలుగా కోయాలని, అప్పుడే మంచి లాభాలు వస్తాయన్నారు. మామిడి పంట జూన్ రెండవ వారంలో తుది దశకు చేరుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారిణి శైలజ, సిబ్బంది పాల్గొన్నారు.

అరుణ వర్ణ శోభితం



పగలంతా భగభగమండిన భానుడు బుధవారం సాయంత్రం హస్తాదిపైకి చేరాడు. ఆకాశంలో నల్లటి మబ్బులు కమ్ముకోగా భానుడు తన పసిడి వర్ణ కిరణాలతో మెరిసిపోతూ తిరుమల సప్తగిరుల్లోని గోవిందుని రూపాన్ని స్పృశించాడు. అలాగే నగరంలోని లీలామహల్ కూడలి వద్దనున్న శ్రీనివాస సేతు ఫ్లైఓవర్ వద్ద ఆకాశం బంగారు వర్ణంలో ధగధగా మెరుస్తూ స్థానికులకు కనువిందు చేసింది. - కేతారి మోహనకృష్ణ, సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

ఘనంగా ముగిసిన తిరుచానూరు గంగ జాతర



కొర్రబండిని పరిశీలిస్తున్న సర్పంచ్ రామచంద్రారెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు

- అమ్మవారికి సారె సమర్పించిన సర్పంచ్ రామచంద్రారెడ్డి

తిరుచానూరు(చంద్రగిరి): ఈ నెల 21న చాటు పొంగళ్లతో ప్రారంభమైన తిరుచానూరు గంగ జాతర బుధవారం ఘనంగా ముగిసింది. ఉదయం అమ్మవారికి అభిషేకాలు చేశారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం జల్లి గంగమ్మను ప్రతిష్ఠించి విశేష పూజలు చేశారు. తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి ఊరేగింపుగా అమ్మవారికి సారె తీసుకొచ్చారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ నిర్వాహకులు స్వాగతం పలికారు. మహిళలు పెద్ద సంఖ్యలో పొంగళ్లు పెట్టారు. రాత్రి 11 గంటలకు నూతనంగా తయారు చేసిన కొర్రబండిపై అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించారు. అనంతరం అమ్మవారిని నిమజ్జనం చేసి ఉత్సవాలను ముగించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సర్పంచ్ రామచంద్రారెడ్డి, పొక్కాలమ్మ ఆలయ చైర్మన్ శ్రీధర్ రెడ్డి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆర్‌ఆర్ యూత్ ఆధ్వర్యంలో భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాల పంపిణీ చేశారు. జాతరను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.



విశేష అలంకరణలో తిరుచానూరు గ్రామ దేవత

రామచంద్రరాజుకు సన్మానం

తిరుపతి అర్బన్: తిరుపతి రైల్వే సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ బుధవారం ఉద్యోగ విరమణ పొందిన రామచంద్రరాజును రైల్వే ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. తిరుపతిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో సన్మాన సభ నిర్వహించారు. ఆయన దక్షిణ మధ్య రైల్వేలో 35 ఏళ్లపాటు వివిధ హోదాల్లో పనిచేశారని పేర్కొన్నారు.

క్రీడా శిక్షణ శిబిరాల సందర్శన



క్రీడాకారులకు పతకాలు అందజేస్తున్న శాప్ చీఫ్ కోచ్ సయ్యద్, ఒలింపిక్ స్టేషన్ అధ్యక్షుడు వై.ప్రవీణ్

తిరుపతి కల్చరల్: తిరుపతి జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో తిరుపతిలో జరుగుతున్న ఉచిత క్రీడా శిక్షణ శిబిరాలను బుధవారం శాప్ చీఫ్ కోచ్ సయ్యద్, ఒలింపిక్ స్టేషన్ అధ్యక్షుడు డాక్టర్ వై.ప్రవీణ్, కార్యదర్శి శ్రీధర్ సందర్శించారు. బైరాగిపట్టెడలోని కెన్‌భూ కాయ్ కరాటే స్కూల్‌ను సందర్శించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభతో పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు. వారికి పతకాలు బహూకరించారు. శిక్షకుడు రత్నాకర్‌ను అభినందించారు. అనంతరం తారకరామ స్టేడియంలో క్రీడా శిక్షణ శిబిరాన్ని సందర్శించి, అక్కడ వివిధ అంశాలలో శిక్షణ పొందుతున్న అథ్లెటిక్స్‌ను అభినందించారు.

కొల్లం ఆయుర్వేద సంస్థల పరిశీలన



కొల్లం ఆయుర్వేద సంస్థల ప్రతినిధులతో చర్చిస్తున్న టీటీడీ అధికారులు

తిరుపతి కల్చరల్: టీటీడీ జేఈవో సదా భార్గవి, సీఏవో శేషశైలేంద్ర, ఆయుర్వేద ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రేణు దీక్షిత్ బృందం బుధవారం కేరళ రాష్ట్రం కొల్లంలోని అమృత ఆయుర్వేద ఆసుపత్రి, కళాశాల, ఫార్మసీ, పరిశోధనాలయాన్ని పరిశీలించారు. ఆ సంస్థ నిర్వహిస్తున్న పరిశోధన కేంద్రం, ఆసుపత్రి, ఫార్మసీని పరిశీలించి అక్కడి విధానాలపై అధికారులతో చర్చించారు. ఓపీ, ఇన్ పేషెంట్ సేవలు అందిస్తున్న విధానంపై తెలుసుకున్నారు. ఆయుర్వేద కళాశాలకు అనుబంధంగానున్న ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న ఉచిత వైద్యం, రుసుము వసూలు చేసి అందిస్తున్న వైద్య సేవల వివరాలు తెలుసుకున్నారు. ఇక్కడి ఆయుర్వేద పరిశోధన కేంద్రంలో ఏ మందులు తయారు చేస్తున్నారు, ఏ మందులకు ఎక్కువ డిమాండ్ ఉందనే వివరాలు తెలుసుకున్నారు. ఫార్మసీ నిర్వహణ, మందుల మార్కెటింగ్ విధానాలపై చర్చించారు. అనంతరం ఆసుపత్రి డీన్ డాక్టర్ శంకర్ అమృతానంద పురి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్, రీసర్చ్ హెడ్ డాక్టర్ రాం మనోహర్, టీటీడీ ఆయుర్వేద కళాశాల పూర్వ విద్యార్థి, ఆ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ వినీత్‌తో కలిసి వివిధ అంశాలపై చర్చించారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి చర్యలు



సివిల్ రైట్స్ డేలో పాల్గొన్న అధికారులు, ఉద్యోగులు

తిరుపతి అర్బన్: ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తిరుపతి అర్బన్ తహసీల్దార్ వెంకటరమణ తెలిపారు. తిరుపతి నగరం 21వ వార్డు ఎల్బీనగర్‌లోని వినాయకస్వామి గుడి వీధిలో బుధవారం సివిల్ రైట్స్‌డే నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ కులవివక్ష చూపరాదని, రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఎస్‌ఐ అనిత మాట్లాడుతూ కులవివక్ష చూపడం నేరమని, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రాపూరి ప్రసాద్‌బాబు మాట్లాడుతూ అభివృద్ధిలో అంతా భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నేత అనీల్, మునిచంద్రారెడ్డి, వినాయకగుడి అధ్యక్షుడు కుమార్, వీఆర్వో చెంగల్ రాయల్ పాల్గొన్నారు.

పొగాకుతో జీవితం నాశనం



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి

తిరుపతి తుడా: పొగాకు ఉత్పత్తులను వాడితే జీవితాలు నాశనమవుతాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి తెలిపారు. పొగాకు నియంత్రణ దినోత్సవం సందర్భంగా బుధవారం తిరుపతిలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి టౌన్ క్లబ్ కూడలి వరకు సాగింది. ఈ సందర్భంగా పొగాకు వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి మాట్లాడుతూ పొగాకు వాడడం వల్ల పరిసర ప్రాంతాలు కలుషితం అవుతాయని, తీవ్ర అనారోగ్య సమస్యలు తప్పవని గుర్తు చేశారు. క్యాన్సర్‌కు ప్రధాన కారణం పొగాకేనన్నారు. కేంద్రం రూపొందించిన పొగాకు చట్టం ప్రకారం నో స్మోకింగ్ జోన్లను ప్రతి ఒక్కరూ అమలు చేయాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల పరిధిలో 100 గజాలలోపు ఉన్న దుకాణాల్లో సిగరెట్లు, బీడీలు వంటి పొగాకు ఉత్పత్తులను విక్రయించడం చట్ట విరుద్ధమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధారాణి, ఇతర వైద్యాధికారులు హనుమంతరావు, శాంతకుమారి, హరినాథ్, అరుణ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలకు కృషి



రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

తిరుపతి తుడా: పేద రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానని తిరుపతి రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు తెలిపారు. ఆయన బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించేందుకు రూ.వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. ఆయా పథకాలను అందిపుచ్చుకుని పేదలకు నాణ్యమైన వైద్యం అందిస్తామన్నారు. ఆసుపత్రి హెడ్ ఆఫ్ ద డిపార్ట్‌మెంట్స్, వైద్యులు, వైద్య విద్యార్థులు, నర్సులతో సమన్వయం చేసుకొని అభివృద్ధికి శక్తివంచన లేకుండా పనిచేస్తానన్నారు. డాక్టర్ రవిప్రభును రుయా అభివృద్ధి కమిటీ వర్కింగ్ చైర్మన్ బండ్ల చంద్రశేఖర్ రాయల్, ఏపీఎన్‌జీవో ప్రతినిధులు సురేష్, వరప్రసాద్, ఉద్యోగుల సంఘం నాయకుడు రాజా, వైద్యాధికారులు లక్ష్మానాయక్, యువ అన్వేష్ రెడ్డి, ఏడీ రత్నరాజు, టౌన్ బ్యాంకు వైస్ ప్రెసిడెంట్ వాసూయాదవ్, కేసీ సుబ్రమణ్యం, బాలసుబ్రమణ్యం, శ్రీనివాసులు అభినందించారు.

సమస్యల పరిష్కారానికే సివిల్ రైట్స్ డే



సమావేశంలో మాట్లాడుతున్న డీటీ పరదేశి

పాకాల : సమస్యల పరిష్కారానికే సివిల్ రైట్స్‌డే నిర్వహిస్తున్నట్లు డీటీ పరదేశి తెలిపారు. మండలంలోని చెన్నుగారిపల్లిలో బుధవారం సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవడం గ్రామస్తుల బాధ్యతని వివరించారు. గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వీధికి అడ్డుగా ఉందని, తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. అలాగే వీధి కొళాయిలు ఏర్పాటుచేయాలని, శ్మశానానికి దారి సౌకర్యం కల్పించాలని కోరారు. అదేవిధంగా పొగాకు నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన కల్పించారు. చెన్నుగారిపల్లి సచివాలయం సీహెచ్‌ఎం గాయత్రి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పొగాకు వాడకాన్ని మానాలని సూచించారు. పొగాకు వల్లే క్యాన్సర్ వస్తుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కళావతి, వీఆర్వో లతశ్రీ, జీఎంఎస్‌కే లీలావతి, ఏఎన్‌ఎం అనసూయ తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న డీసీఎల్ బాలూనాయక్

తిరుపతి రూరల్: జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు కార్మిక శాఖ జిల్లా ఉప కమిషనర్ బాలూనాయక్ తెలిపారు. తిరుపతిలోని డీసీఎల్ కార్యాలయంలో బుధవారం జిల్లా బాల కార్మిక టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఇందులో కార్మిక, రెవెన్యూ, పోలీస్, విద్యా, ఐసీడీఎస్, వైద్యం, సాంఘిక సంక్షేమశాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. డీసీఎల్ బాలూనాయక్ మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థను రూపుమాపేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలో జూన్ ఒకటి నుంచి 30వ తేదీ వరకు టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టనున్నట్లు తెలిపారు. బాలలను పనిలో పెట్టుకునే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్యాంపస్ సెలక్షన్స్‌లో 37 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన వారితో కళాశాల ప్రతినిధులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి భవానీనగర్ సర్కిల్‌లోని గేట్ డిగ్రీ కళాశాలలో బుధవారం రిలయన్స్ జియో సంస్థలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అభ్యర్థులకు వివిధ దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహించి ప్రతిభ కనబరచిన 37 మందిని ఎంపిక చేశారు. వారిని కళాశాల కరస్పాండెంట్ తమ్మినేని వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ రమేష్ అభినందించారు.

మూలస్థాన ఎల్లమ్మ సేవలో ప్రభుత్వ విప్ చెవిరెడ్డి



అమ్మవారిని దర్శించుకుంటున్న ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మూలస్థాన ఎల్లమ్మను బుధవారం ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు యారాశి చంద్రశేఖర్ రెడ్డి, ఈవో రామక్రిష్ణారెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆలయం వద్ద చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో చర్చించారు. ప్రధానంగా జాతీయ రహదారి నుంచి ఆలయం వరకు నూతనంగా నిర్మించనున్న సిమెంటు రోడ్డు, గర్భాలయం ఆధునీకీకరణ, ముఖమండపం, పరివార దేవతా మూర్తుల ఆలయాల ఆదునికీకరణ పనులపై సమగ్రంగా చర్చించారు. అంతకు ముందు ఆలయం వద్ద ప్రతి శుక్రవారం భక్తులకు నిర్వహించే అన్నదానంపై ఆరా తీశారు.

ప్రజాసేవకులకు వందనం



వలంటీర్లను సత్కరిస్తున్న కేతం జయచంద్రారెడ్డి, చిమట రమేష్

తిరుపతి మంగళం : నిత్యం ప్రజల్లోనే ఉంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ప్రజాసేవకులకు వందనమని తిరుపతి టౌన్ బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి తెలిపారు. తిరుపతి 7వ డివిజన్ అధ్యక్షులు చిమట రమేష్ ఆధ్వర్యంలో బుధవారం ఆ డివిజన్‌లోని సచివాలయ ఇన్‌చార్జ్‌లు, వలంటీర్లకు శాలువాలు కప్పి జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి లక్షల మంది యువతకు ఉద్యోగాలు ఇవ్వడంతో పాటు అర్హులైన లబ్ధిదారుల ఇంటి వద్దకే ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. దేశంలోనే జగనన్న ప్రవేశ పెట్టిన సచివాలయ వ్యవస్థ ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఇంచార్జ్‌లు, వార్డు కన్వీనర్లు జగదీస్, ఢిల్లీ, ఈశ్వర్‌యాదవ్, పురుషోత్తం, మల్లికార్జున పాల్గొన్నారు.

టీటీడీ నిర్ణయం ఉపసంహరించుకోవాలి



నిరసన తెలుపుతున్న ప్రైవేటు వాహన సంఘాల నేతలు, డ్రైవర్లు

తిరుపతి కల్చరల్: 12 నుంచి 15 ఏళ్లు కలిగిన పాత వాహనాలను తిరుమలకు అనుమతించమని టీటీడీ అధికారులు తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని తిరుమల, తిరుపతి డ్రైవర్స్, ఓనర్స్ జేఏసీ అధ్యక్షుడు రాజేష్ యాదవ్ డిమాండ్ చేశారు. జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం అలిపిరి గరుడ సర్కిల్ వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ 12 ఏళ్లు పైబడిన వాహనాలను తిరుమలకు అనుమతించమని తిరుమల ఏఎస్‌ఎస్పీ మునిరామయ్య చెప్పడం దారుణమన్నారు. 30 ఏళ్లుగా తిరుమలకు వచ్చే యాత్రికులను నమ్ముకుని సుమారు 40 వేల మంది డ్రైవర్లు జీవనం సాగిస్తున్నారని తెలిపారు. 12 ఏళ్లు పైబడిన వాహనాలను తిరుమలకు అనుమతించకపోతే వారి కుటుంబాలు రోడ్డున పడతాయని పేర్కొన్నారు. తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక వాహనాలు ప్రమాదాలకు గురైతే తమపై కన్నెర్ర చేయడం సరికాదన్నారు. ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తిరుమల, తిరుపతి డ్రైవర్స్ అండ్ ఓనర్స్ జేఏసీ కార్యదర్శి ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు హరినాయక్, వ్యాన్ అసోసియేషన్ కార్యదర్శి మోహన్, జీప్ యూనియన్ అధ్యక్షుడు ఢిల్లీబాబు, వాసు, శేఖర్‌రెడ్డి, రాజేష్ నాయక్ పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్ రోడ్లపై దృష్టి సారించండి



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధిపై దృష్టి సారించి సకాలంలో పూర్తి చేయాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత అధికారులను ఆదేశించారు. ఆమె బుధవారం మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధిపై టౌన్ ప్లానింగ్ అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ రోడ్ల పనులు జరుగుతున్న ప్రాంతాల్లో టీడీఆర్ బాండ్‌ల్ అందించేందుకు చొరవ తీసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వివరాల ఆధారంగా కొలతలు తీసుకోవాలన్నారు. గొల్లవానికుంట రోడ్డులో ఇళ్లు కోల్పోయిన వారికి తహసీల్దార్‌తో మాట్లాడి ఇంటి స్థలాలు చూపించాలన్నారు. అదనపు కమిషనర్ సునీత, ఏసీపీలు బాలసుబ్రమణ్యం, షణ్ముగం, టీపీవోలు శారదాంబ, సాయిలీల, సూపరింటెండెంట్లు హసీమ్, రాజశేఖర్ పాల్గొన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ హరిత సరోజినీ దేవి రోడ్డులోని 38వ డివిజన్ వార్డు సచివాలయాలను తనిఖీ చేశారు. సచివాలయ సెక్రటరీలు సమయపాలన పాటించాలని సూచించారు. పన్నులు, యూజర్ చార్జీల వసూళ్లపై దృష్టి సారించాలన్నారు.

రామిరెడ్డిపల్లిలో వేడుకగా గంగ జాతర



గంగమ్మకు సారెను సమర్పిస్తున్న సినీనటుడు మంచు మోహన్‌బాబు, పక్కన సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి

- అమ్మవారికి సారె సమర్పించిన సినీనటుడు మోహన్ బాబు, చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం రామిరెడ్డిపల్లిలో బుధవారం గంగ జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ఊరేగించారు. ఉదయం అమ్మవారి ప్రతిమను ఏర్పాటు చేసి అభిషేకాలు చేశారు. గంగ జాతర సందర్భంగా ప్రముఖ సినీ నటుడు, ఎంబీయూ చాన్స్‌లర్, విద్యానికేతన్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ మోహన్ బాబు, వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి వేర్వేరుగా అమ్మవారికి సారె అందజేశారు. వారికి రామిరెడ్డిపల్లి సర్పంచ్ కొటాల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ పద్మజ ఘనంగా స్వాగతం పలికారు.

సైన్స్ సెంటర్‌లో జన్యు వ్యక్తీకరణ మొబైల్ సైన్స్ ప్రదర్శన



మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న సందర్శకులు

తిరుపతి కల్చరల్: జన్యు పరీక్ష మెరుగైన జీవితానికి సుగమ మార్గమమని, సైన్స్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన జీన్–హెల్త్ కనెక్షన్ కొత్త మొబైల్ సైన్స్ ప్రదర్శనను సందర్శించాలని ఎస్వీయూ వీసీ రాజారెడ్డి పిలుపునిచ్చారు. బెంగళూరు విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నలాజికల్ మ్యూజియం, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియమ్స్, భారత సాంస్కృతిక మంత్రిత్వ శాఖ సంయుక్తంగా రూపొందించిన జీన్ –హెల్త్ కనెక్షన్ కొత్త మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్‌ను బుధవారం ఎస్వీయూ వీసీ రాజారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్ బస్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సుమారు 20 వర్కింగ్ మోడల్స్ జన్యువు, ఆరోగ్యం మధ్య ఉన్న సంబంధాన్ని వివరిస్తూ ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారన్నారు. మనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపుని తీసుకురావడంతో పాటు మనల్ని వైవిధ్యంగా మార్చడంలో జన్యువులు పోషించే కీలక అంశాలను ఇందులో వివరిస్తున్నట్లు తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ ఆదివారం వరకు ఉంటుందని, ప్రజలందరూ సందర్శించాలని కోరారు. కార్యక్రమంలో రీజనల్ సైన్స్ సెంటర్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ, సిబ్బంది పాల్గొన్నారు.